సాక్షి
సిద్దిపేట
గురువారం । 30 । జనవరి । 2025

జాతరలో భక్తజన సందోహం, (ఇన్‌సెట్‌లో..) మోయతుమ్మెద నదిలో పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు





సింగరాయ కొండపై జనమేజనం

వైభవంగా లక్ష్మీనరసింహ స్వామి జాతర

సింగరాయ కొండ భక్తజనసంద్రమైంది. కోహెడ మండలం కూరెళ్ల, తంగళ్లపల్లి శివారులో బుధవారం జరిగిన ప్రతాప రుద్ర సింగరాయ లక్ష్మీనరసింహ స్వామి జాతరకు భక్తులు పోటెత్తారు. ప్రతి ఏడాది మౌని అమావాస్య రోజు సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు జాతర జరుగుతుంది. స్వామిని దర్శించుకునేందుకు వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఇక్కడ ప్రత్యేకంగా తూర్పు నుంచి పడమరకు ప్రవహించే మోయతుమ్మెద వాగులో భక్తులు పుణ్యస్నానాలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు. పచ్చని చెట్ల కింద చెలిమె నీటితో వంకాయ కూర, చింత పులుసు తయారు చేసి స్వామి వారికి నైవేద్యం సమర్పించారు. ఆర్డీఓ రామ్మూర్తి, తహసీల్దార్ సురేఖ జాతరను పర్యవేక్షించారు. ఏసీపీ సతీష్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. – కోహెడరూరల్(హుస్నాబాద్)

న్యూస్‌రీల్

రోడ్ల మరమ్మతులకు రూ.5.13 కోట్లు

ఎమ్మెల్యే హరీశ్‌రావు వెల్లడి



సిద్దిపేటఅర్బన్: నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో బీటీ రోడ్ల మరమ్మతులకు రూ.5.13 కోట్ల నిధులు మంజూరు అయినట్లు ఎమ్మెల్యే హరీశ్‌రావు బుధవారం పేర్కొన్నారు. చిన్నకోడూరు పీడబ్ల్యూడీ నుంచి చౌడారం వరకు 3.5 కి.మీ రోడ్డు మరమ్మతుకు రూ.1.58 కోట్లు, నారాయణరావుపేట మండలం కోదండరావుపల్లి నుంచి లక్ష్మీదేవిపల్లి ఎస్సీ కాలనీ వరకు 1.5 కి.మీ. రోడ్డుకు రూ.66.30లక్షలు మంజూరయ్యాయన్నారు. నంగునూర్ మండలం అక్కెనపల్లి నుంచి కరీంనగర్ జిల్లా బార్డర్ వరకు రూ.59 లక్షలు, సిద్దిపేట అర్బన్ మండలం బూరుగుపల్లి వడ్డెర కాలనీ నుంచి ఎన్సాన్‌పల్లి మధిర తిప్పరబోయిన కాలనీ వరకు రూ.66.74 లక్షలు, సిద్దిపేట రూరల్ మండలం రఘవాపూర్ నుంచి హౌసన్‌మీరాపూర్ వరకు దాదాపు 4 కి.మీ రోడ్డుకు రూ.1.63 కోట్లు మంజూరు అయ్యాయని పేర్కొన్నారు.

పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఆర్ఆర్‌బీ, ఎస్ఎస్‌సీ, బ్యాంకింగ్ తదితర పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఉచిత శిక్షణ అందించనున్నారు. జిల్లా బీసీ స్టడీ సర్కిల్‌లో ఉచితంగా ఫౌండేషన్ కోర్సు శిక్షణ అందించనున్నట్లు, వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి నాగరాజమ్మ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఓసీ అభ్యర్థులకు డిగ్రీలో వచ్చిన మార్కుల ఆధారంగా అభ్యర్థుల ఎంపిక జరుగుతుందన్నారు. అభ్యర్థులు వచ్చే నెల 9వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఉచిత ఫౌండేషన్ కోర్సు వచ్చే నెల 15 నుంచి ప్రారంభించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 94902 49095 నంబర్‌లో సంప్రదించాలన్నారు.


ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు డీబీఎఫ్ ఫిర్యాదు



చైర్మన్‌కు ఫిర్యాదు చేస్తున్న డీబీఎఫ్ నాయకులు

మిరుదొడ్డి(దుబ్బాక): సూర్యాపేట జిల్లా కేంద్రంలో దళిత యువకుడిని హత్య చేసిన హంతకులను కఠినంగా శిక్షించాలంటూ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకు, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డికి డీబీఎఫ్ ఫిర్యాదు చేసింది. బుధవారం అక్బర్‌పేట–భూంపల్లి మండల కేంద్రంలో డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి. శంకర్ నేతృత్వంలో ఫిర్యాదును అందించారు. దీంతో చైర్మన్ సానుకూలంగా స్పందించి నిందితులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. డీబీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు భీమ్ శేఖర్, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

ఐక్యతతోనే హక్కుల సాధన



మహాధర్నా పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బీఎన్ఆర్‌కేఎస్ నాయకులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): కార్మికులు ఐక్యతతో పోరాడి హక్కులు సాధించుకోవాలని బీఎన్ఆర్‌కేఎస్ జిల్లా అధ్యక్షుడు నర్ర భిక్షపతి అన్నారు. మహాధర్నాకు సంబంధించిన పోస్టర్లను బుధవారం జగదేవ్‌పూర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది రంగాల కార్మికులకు సంబంధించిన బోర్డును ప్రైవేటుకు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ ఫిబ్రవరి 3న మహాధర్నా జరుగనుందన్నారు. హైదరాబాద్‌లో జరిగే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎల్లేష్, కిషోర్, నర్సింహులు, కనకయ్య, బాల్‌నర్సయ్య పాల్గొన్నారు.

మూషిక జింకలు ఏవీ?

- రెండున్నర ఏళ్లుగా నిలిచిన పునరుత్పత్తి
- నిరుపయోగంగా ఎన్‌క్లోజర్
- తేజోవనం అభివృద్ధిపై దృష్టిసారించని పాలకులు



సాక్షి, సిద్దిపేట: మూషిక జింకల పునరుత్పత్తి కేంద్రం అర్ధంతరంగా నిలిచిపోయింది. సిద్దిపేటలోని తేజోవనం మూషిక జింకల పెంపకాన్ని రెండున్నర ఏళ్లుగా నిలిపివేశారు. పార్క్ విస్తీర్ణం ఎక్కువగా ఉన్నప్పటికీ జంతువులు అంతగా లేకపోవడంతో సందర్శకులు రావడం తగ్గింది. ఇండియన్ వైల్డ్ ఎనిమల్ యాక్ట్ ప్రకారం అంతరించిపోతున్న జంతువుల జాబితాల్లోని షెడ్యూల్–1 జంతువుగా మూషిక జింకను చేర్చారు. దేశంలో ఇవి క్రమంగా కనుమరుగవుతున్న తరుణంలో హైదరాబాద్‌లోని నెహ్రూ జూపార్కులో 2010లో పునరుత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. వాటితో సిద్దిపేటలో 2022 నుంచి పునరుత్పత్తి చేయడం ప్రారంభించారు.

కనువిందుతో పాటు..

మూషిక జింకల బరువు ఐదు నుంచి ఆరు కిలోలకు మించదు. రాత్రిపూట చురుగ్గా పరుగులు తీస్తాయి. పండ్లు పుట్టగొడుగుల్ని తింటాయి. సహజ అడవుల్లో వీటి సంతతి పెరగాలన్నది లక్ష్యం. మూషిక జింకలు అడవిలో ఉండే పలు రకాల పండ్లు తిని వాటి మలం ద్వారా అడవిలో విత్తనాలు వెదజల్లడంతో మొక్కలు సైతం ఎక్కువగా పెరిగే అస్కారం ఉంది. ఇలా చేయడం వలన అడవిలో మొక్కలు పెరిగి.. పచ్చదనంగా ఉంటుంది. పలు రకాల అడవి చెట్లు అంతరించి పోయే అవకాశం తక్కువగా ఉండనుంది. ఒక వైపు సందర్శకులకు కనువిందు..... చెట్లు అంతరించిపోకుండా రక్షణగా మూషిక జింకలు దోహదపడేవి. గతంలో వదిలిన మూషిక జింకలు ఎన్ని ఉన్నాయి అని అటవీ అధికారుల దగ్గర లెక్కలు లేవు.

ఎన్‌క్లోజర్‌లో పిచ్చి మొక్కలు..

మూషిక జింకలు ఇక్కడి ప్రాంతంలో అలవాటు అయ్యే వరకు పెంచేందుకు అటవీ శాఖ ఎన్‌క్లోజర్‌ను నిర్మించారు. అందులో మూషిక జింకలకు ఆవాసం కల్పించకపోవడంతో నిరుపయోగంగా మారింది. అందులో పిచ్చి మొక్కలు పెరిగాయి. అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా కొనసాగుతున్నారు. ఇప్పటికైనా మంత్రి కొండా సురేఖ స్పందించి తేజోవనం అభివృద్ధికి కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రెండు విడతల్లో 20 జింకలు

సిద్దిపేట, కొండపాక మండలాల్లో అటవీ విస్తీర్ణం 500 ఎకరాలు ఉండటంతో అటవీ శాఖ ఆధ్వర్యంలో తేజోవనం(అర్బన్ పార్క్)ను ఏర్పాటు చేశారు. అందులో చిల్డ్రన్ పార్క్, వాచ్ టవర్, పలు చోట్ల చైర్‌లను ఏర్పాటు చేశారు. హైదరాబాద్ జూపార్క్‌లో మూషిక జింకలు ఉత్పత్తి పెరగడంతో పలు అడవుల్లో, అర్బన్ పార్క్, తేజవనంలలో వదిలి పునరుత్పత్తి కార్యక్రమానికి అటవీశాఖ శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా సిద్దిపేటలోని తేజోవనంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఎన్‌క్లోజర్‌లలో రెండు విడతలలో 20 మూషిక జింకలను 60రోజుల పాటు పెంచగా అందులో 16 మాత్రమే బతికాయి. వాటిని పార్క్‌లో వదిలి పెట్టారు. ఈ పార్క్‌లో పలు రకాల జింకలు, నెమళ్లు, మూషిక జింకలు అప్పుడప్పుడు సందర్శకులకు కనువిందుచేస్తున్నాయి.



సిద్దిపేటలోని తేజోవనం

జూపార్క్ వారు అందించాలి

హైదరాబాద్ జూ పార్క్ నుంచి మూషిక జింకలు రావాలి. వారు అందిస్తే పునరుత్పత్తి కేంద్రాన్ని తిరిగి ప్రారంభిస్తాం. అలాగే వీటికి 60 రోజుల పాటు ఎన్‌క్లోజర్‌లో పెడతాం. కనుక నిధులు సైతం అవసరం.

– ఇక్రమొద్దీన్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్

భూసేకరణ వేగిరం చేయండి

- రిజర్వాయర్ల కాలువలను త్వరితగతిన నిర్మించాలి
- కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి
- రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో కలెక్టర్ సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి

సిద్దిపేటరూరల్: రంగనాయక సాగర్, మల్లన్న సాగర్ రిజర్వాయర్ల కాలువల కోసం భూసేకరణ ప్రక్రియను వేగిరం చేయాలని కలెక్టర్ ఎం.మను చౌదరి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులతో అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఇరిగేషన్ శాఖ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రిజర్వాయర్ల కెనాల్స్ గురించి వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రంగనాయక సాగర్, మల్లన్న సాగర్ రిజర్వాయర్ల నుంచి నీటి పంపిణీకి మెజర్ కెనాల్స్ పనులు దాదాపు పూర్తయినప్పటికీ మైనర్, సబ్ మైనర్ కెనాల్స్ కోసం భూసేకరణ ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కాలువల నిర్మాణం పూర్తయితే ఆయకట్టు గణనీయంగా పెరిగే ఆస్కారం ఉందన్నారు. భూసేకరణలో అడ్డంకులు ఎదురవుతున్నందున రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ అధికారులు ఫీల్డులోకి పక్కా ప్రణాళికతో వెళ్లాలని తెలిపారు. మండలాల వారీగా రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు బృందంగా ఏర్పడి భూసేకరణ వేగవంతంగా చేయాలన్నారు. కాలువల వల్ల జరిగే ప్రయోజనాలను వివరిస్తూ భూసేకరణ జరపాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(భూసేకరణ) గీత, ఆర్డీఓ సదానందం, ఇరిగేషన్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నిఘా నీడన ప్రాక్టికల్స్



మాట్లాడుతున్న డీఐఈఓ రవీందర్‌రెడ్డి

- నాలుగు విడతలుగా పరీక్షల నిర్వహణ
- ల్యాబ్‌లలో సీసీ కెమెరాల ఏర్పాటు
- డీఐఈఓ రవీందర్‌రెడ్డి

సిద్దిపేట ఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్ పరీక్షలను నిఘా నీడన పకడ్బందీగా నిర్వహించనున్నట్లు డీఐఈఓ రవీందర్‌రెడ్డి తెలిపారు. ఫిబ్రవరి 3 నుంచి 28 వరకు నిర్వహించనున్న ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షల నిర్వహణ నేపథ్యంలో బుధవారం జిల్లాలోని కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో పట్టణంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రాక్టికల్స్ నిర్వహణ కోసం అన్ని ప్రయోగశాలలో సీసీ కెమెరాల ను ఏర్పాటు చేయనున్నామన్నారు. పరీక్షల్లో ఎలాంటి పొరపాట్లకు తావివ్వరాదన్నారు. ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, సిబ్బంది అందరూ నిబద్ధతతో పని చేయాలని సూచించారు. అలసత్వం వీడాలని లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎగ్జామినర్ ఒకరోజు ముందుగానే పరీక్ష కేంద్రాన్ని సందర్శించి ప్రయోగశాలల వసతులు, మెటీరియల్ తదితర విషయాలను చూసుకోవాలన్నారు. విద్యార్థులకు హాల్ టికెట్లు, పరీక్ష ఎప్పుడు తదితర విషయాలను స్పష్టంగా వివరించాలన్నారు. అధ్యాపకులు సిబ్బంది పరీక్ష సమయంలో తప్పనిసరిగా ఐడి కార్డులు ఉండేలా చూసుకోవాలన్నారు. ఇప్పటికే ఆన్సర్ బుక్ లను పరీక్షా కేంద్రాలకు పంపిణీ చేశామన్నారు. జిల్లాలో మొత్తం 62 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈసారి ప్రాక్టికల్ పరీక్షలకు డిపార్ట్‌మెంటల్ అధికారుల నియామకం లేదన్నారు. జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు జ్యోతి, గంగాధర్, దేవయ్య, ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కూచం గారి శ్రీనివాస్, సత్యనారాయణ రెడ్డిలు పరీక్షల నిర్వహణపై పలు సూచనలు సలహాలు అందించారు.

ఐక్యతతోనే సమస్యలు పరిష్కారం

బీఎమ్మెస్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్

సిద్దిపేటజోన్: అసంఘటిత కార్మికులను ఏకం చేసి ఐక్య ఉద్యమాల ద్వారా సమస్యలు పరిష్కరించుకోవాలని, పోరాటాలతోనే హక్కులను సాధించుకోవచ్చని భారతీయ మజ్దూర్ సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు కలాల్ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక విపంచి ఆడిటోరియంలో తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘ్ (బీఎమ్మెస్) రాష్ట్ర ద్వితీయ మహాసభలు జరిగాయి. ముఖ్యఅతిథిగా హాజరై శ్రీనివాస్ మాట్లాడారు. కార్మికుల సంక్షేమం కోసం ఖర్చు చేయాల్సిన నిధులను ప్రభుత్వం ఇతర ప్రయోజనాల కోసం వినియోగించడం సమంజసం కాదన్నారు. కార్మికుల గుర్తింపు కార్డుల కోసం రోజుల తరబడి మీసేవా కేంద్రాల చుట్టూ తిరిగే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. వెల్ఫేర్ బోర్డులో గుర్తింపు పొందిన కార్మిక సంఘాల నాయకులను సభ్యులుగా నియమిస్తే సమస్యలు త్వరగా పరిష్కరించవచ్చన్నారు. ఈ సందర్భంగా 17 అంశాలపై మహాసభలో ఏకగ్రీవంగా తీర్మానించారు. కార్యక్రమంలో బీఎమ్మెస్ రాష్ట్ర కార్యదర్శి రాంరెడ్డి, భవన నిర్మాణ సంఘ్ దక్షిణ భారత ప్రబారి పాటిల్, జిల్లా బీఎమ్మెస్ అధ్యక్షుడు తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడిగా మల్లారెడ్డి



సిద్దిపేటఅర్బన్: సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడిగా జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి ఎన్నికయ్యారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలో జరుగుతున్న సీపీఎం రాష్ట్ర 4వ మహాసభలో ఆయన్ను రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఎన్నుకున్నారు. ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, ప్రజానాట్య మండలి, రైతు సంఘాలలో వివిధ స్థాయిలలో పనిచేశారు. సీపీఎం ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడిగా, జిల్లా పునర్విభజన తర్వాత సిద్దిపేట జిల్లా కార్యదర్శిగా నియమితులయ్యారు. గతనెలలో జరిగిన జిల్లా మూడవ మహాసభల్లో మూడవ సారి కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

వేసవిలోనూ నిరంతరం విద్యుత్ సరఫరా

విద్యుత్‌శాఖ జిల్లా నోడల్ అధికారి సాయిబాబా



మాట్లాడుతున్న నోడల్ అధికారి సాయిబాబా

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రానున్న వేసవిలోనూ విద్యుత్ వినియోగదారులకు నిరంతర, నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తామని విద్యుత్‌శాఖ జిల్లా నోడల్ ఆఫీసర్ సాయిబాబా, ఎస్ఈ చంద్రమోహన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని విద్యుత్ భవన్‌లో వారు పాల్గొని మాట్లాడారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ప్రతి జిల్లాకు నోడల్ అధికారులను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఈ మేరకు బుధవారం నోడల్ అధికారి సాయిబాబా, ఎస్ఈ చంద్రమోహన్‌తో కలిసి జిల్లాలో పర్యటించారు. పలు విద్యుత్ సబ్‌స్టేషన్లు, లైన్‌లు, ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలించారు. అనంతరం జిల్లా విద్యుత్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతేడాదితో పోలిస్తే ఈ వేసవిలో 20 శాతం అధికంగా విద్యుత్ వినియోగం పెరిగే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం రోజువారీగా 9మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం జరుగుతుందని, వేసవి తీవ్రత పెరిగే కొద్దీ 11 మిలియన్ యూనిట్లకు పెరిగే అవకాశం ఉందన్నారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టిందన్నారు. ఇందులో భాగంగా జిల్లాకు ప్రత్యేకంగా రూ.44.07 కోట్ల అదనపు నిధులు కేటాయించిందన్నారు. గృహ, వ్యవసాయ, కమర్షియల్ కేటగిరిలలో పెండింగ్‌లో ఉన్న బకాయిలను వినియోగదారులు నిర్ణీత సమయాలలో చెల్లించి సహకరించాలన్నారు. సమావేశంలో డీఈలు, ఏడీఈలు తదితరులు పాల్గొన్నారు.

మోగిన నగారా



ఎమ్మెల్సీ ఎన్నికలకు షెడ్యూల్ విడుదల

- 3న నోటిఫికేషన్
- 10 వరకు నామినేషన్లకు అవకాశం
- 27న ఎన్నికలు, మార్చి 3న ఫలితాలు
- 71,622 మంది ఉపాధ్యాయ, పట్టభద్రుల ఓటర్లు

సంగారెడ్డి జోన్: ఎమ్మెల్సీ ఎన్నికల నగరా మోగింది. ఉమ్మడి మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాలతో కూడిన ఉపాధ్యాయ, పట్టభద్రుల శాసన మండలి సభ్యుల స్థానాల ఎన్నికలకు సంబంధించి షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల సంఘం బుధవారం విడుదల చేసింది. పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా రఘోత్తమ్‌రెడ్డి కొనసాగుతున్నారు. ప్రస్తుతం ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ సభ్యుల పదవీకాలం మార్చి 29 నాటితో ముగియనున్న నేపథ్యంలో ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. శాసన మండలి ఎన్నికకు ఫిబ్రవరి 3న నోటిఫికేషన్‌ను విడుదల చేయనుంది. నోటిఫికేషన్ విడుదల కాగానే సంబంధిత జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులోకి రానుంది. 10న నామినేషన్లను స్వీకరించి, 27న ఎన్నికలను నిర్వహించనున్నారు. మార్చి 3న ఓట్ల లెక్కింపు, మార్చి 8 లోపు ఎన్నికల ప్రక్రియ ముగియనున్నట్లు షెడ్యూల్‌లో పేర్కొన్నారు.

ఎన్నికల నిర్వహణ అంశాలు	తేదీ
నోటిఫికేషన్ జారీ	ఫిబ్రవరి 3
నామినేషన్‌కు చివరితేదీ	ఫిబ్రవరి 10
నామినేషన్ల పరిశీలన	ఫిబ్రవరి 11
ఉపసంహరణలు	ఫిబ్రవరి 13
పోలింగ్ తేదీ	ఫిబ్రవరి 27
పోలింగ్ సమయం	ఉదయం 8గం.నుంచి సా.4గం వరకు
ఓట్ల లెక్కింపు	మార్చి 3
ఎన్నికల ప్రక్రియ ముగింపు	మార్చి 8

జిల్లాల వారీగా పట్టభద్రుల ఓటర్లు

జిల్లా	స్త్రీలు	పురుషులు	మొత్తం
సంగారెడ్డి	6,765	14,437	21,202
మెదక్	3,420	8,533	11,953
సిద్దిపేట	10,624	20,922	31,546

జిల్లాల వారీగా ఉపాధ్యాయుల ఓటర్ల వివరాలు

జిల్లా	స్త్రీలు	పురుషులు	మొత్తం
సంగారెడ్డి	1,103	1,485	2,588
మెదక్	515	766	1,281
సిద్దిపేట	1,104	1,948	3,052

గతేడాది డిసెంబర్‌లోనే ఓటర్ల జాబితా

ఉమ్మడి మెదక్ జిల్లాలో ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు 71,622 మంది ఓటర్లతో కూడిన తుది జాబితాను గతేడాది డిసెంబర్ 30న ప్రకటించారు. ఆయా జిల్లాలో 71 మండలాలు ఉండగా 102 పోలింగ్ స్టేషన్లను గుర్తించారు. సంగారెడ్డిలో 28మండలాలకు 40 పోలింగ్ స్టేషన్లు, మెదక్‌లో 21మండలాలకు 22, సిద్దిపేటలో 22 మండలాలకు 40 పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. గతంలో ఓటు హక్కు వినియోగించుకున్న వారు సైతం మరోసారి తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలని ఈసీ సూచించడంతో మరోసారి ఓటర్లు ఓటు హక్కుకోసం అప్లై చేసుకున్నారు.

ఇండస్ట్రియల్ పార్కుకు నోటిఫికేషన్ విడుదల

- 124.36 ఎకరాలు కేటాయింపు
- చౌటపల్లి, జనగామ, తోటపల్లిలో ఏర్పాటు



చౌటపల్లి శివారులో నిర్మించనున్న ఇండస్ట్రియల్ పార్కు స్థలం

అక్కన్నపేట(హుస్నాబాద్): చౌటపల్లి గ్రామ క్రాసింగ్ వద్ద నిర్మించనున్న ఇండస్ట్రియల్ పార్కుకు సంబంధించి ప్రాథమిక నోటిఫికేషన్ విడుదలైంది. ఈ సందర్భంగా తహసీల్దార్ అనంతరెడ్డి మాట్లాడుతూ ఇండస్ట్రియల్ పార్కు కోసం చౌటపల్లి, జనగామ గ్రామాలతో పాటు హుస్నాబాద్ మండలం తోటపల్లి శివారు వరకు భూములు సేకరించామన్నారు. చౌటపల్లిలో 83.36ఎకరాలు, జనగామలో 15.20 ఎకరాలు, తోటపల్లిలో 25.20 ఎకరాలు.. మొత్తం 124.36 ఎకరాల భూమిని కేటాయించారు. సంబంధింత భూ యజమానులకు చట్టప్రకారం నష్టపరిహారం కల్పిస్తామని తెలిపారు.

భూ సేకరణకు ప్రతిపాదించిన భూములను ఎవరైనా కొనుగోలు, అమ్మకాలు జరిపితే చర్యలు తీసుకుంటామని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. అలాగే భూ సేకరణపై సంబంధిత రైతులు అభ్యంతరాలు ఉంటే 60రోజుల లోపు ఆర్డీఓ కార్యాలయంలో సంప్రదించవచ్చన్నారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

హవేళిఘణాపూర్(మెదక్): పాపన్నపేట మండలం కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో మెదక్ మండలం మంభోజిపల్లి గీతా విద్యార్థులు జిల్లా స్థాయిలో గెలుపొంది రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని పాఠశాల ప్రిన్సిపాల్ మాధవి, సెక్రటరీ రామాంజనేయులు తెలిపారు. అండర్(16) కబడ్డీ పోటీల్లో బాలుర విభాగంలో శివకుమార్, నిఖిల్, దిలీప్‌సింగ్, బాలికల విభాగంలో సహస్ర, రుచిత వికారాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయిలో పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులను మాధవి, రామాంజనేయులు అభినందించారు.

మార్షల్ ఆర్ట్స్‌లో ప్రతిభ



బాలికకు పతకాలు, ప్రశంసాపత్రాన్ని అందిస్తున్న ఉపాధ్యాయ సిబ్బంది

చిలప్‌చెడ్(నర్సాపూర్): రాష్ట్ర స్థాయి మార్షల్ ఆర్ట్స్ (అండర్-12) పాయింట్ ఫైట్, లైట్ కాంటాక్ట్ విభాగాల్లో విద్యార్థిని బంగారు పతకాలు సాధించి ప్రతిభ చాటింది. వివరాల్లోకి వెళ్తే.. చిలప్‌చెడ్ మండలం జగ్గంపేట గ్రామంలో గల నవభారతి పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న నీరుడి భవజ్ఞ 26, 27 తేదీల్లో హైదరాబాద్ ఉప్పల్ స్టేడియంలో జరిగిన ఓపెన్ కిక్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ రాష్ట్రస్థాయి అండర్-12 స్పారింగ్ విభాగంలో రెండు బంగారు పతకాలను సాధించింది. ఈ సందర్భంగా బుధవారం పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థిని ఘనంగా సన్మానించి, ఆమె సాధించిన బంగారు పతకాలను, ప్రశంసాపత్రాన్ని అందజేశారు. చిన్న వయసులోనే బ్లాక్‌బెల్ట్ సాధించడంతో పాటు, పలు జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీలలో బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించడం హర్షణీయమని పాఠశాల ప్రిన్సిపాల్ హెచ్‌ఎం శ్రీకాంత్ అన్నారు.

స్టాక్ మార్కెట్ పేరిట రూ.25.17 లక్షలు బురిడీ

పటాన్‌చెరు టౌన్: సైబర్ కేటుగాళ్లు రెచ్చిపోతున్నారు. నకిలీ స్టాక్ మార్కెట్ పేరిట వ్యాపారిని బురిడీ కొట్టించి భారీ మొత్తంలో నగదు కాజేశారు. ఈ ఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని న్యూ మారుతీ నగర్‌కు చెందిన వ్యాపారికి గతేడాది అక్టోబర్ 8వ తేదీన వాట్సాప్‌కి స్టాక్ మార్కెట్‌కు సంబంధించిన మెసేజ్ వచ్చింది. వ్యాపారి తన వివరాలను నమోదు చేయగా ఓ వ్యాలెట్ ఐడీని క్రియేట్ చేసి ఇచ్చారు. పెట్టుబడి పెడితే లాభాలు వస్తాయని చెప్పడంతో పలు దఫాలు పెట్టుబడి పెట్టాడు. మొత్తంగా రూ.25 లక్షల 17 వేలు ఇన్వెస్ట్ చేశాడు. చివరగా తాను పెట్టిన నగదుతోపాటు లాభాల ఇవ్వాలని అడుగగా అపరిచిత వ్యక్తి స్పందించలేదు. బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బుధవారం అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

అఘోరీపై కేసు నమోదు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి దర్శనానికి మంగళవారం వచ్చిన అఘోరీ ఆలయ పరిసరాల్లో కత్తితో హల్‌చల్ చేసిన విషయం తెలిసిందే. భక్తులపై దాడి చేయడంతో సిద్దిపేట సీపీ అనురాధ ఆగ్రహం వ్యక్తం చేసి అఘోరీ పై కేసు నమోదు చేయాలని కొమురవెల్లి పోలీసులను ఆదేశించారు. బుధవారం కేసు నమోదు చేశారు.



పాపన్నపేట(మెదక్): ఘనపురం ఆనకట్ట వద్ద మాఘస్నానాలు చేస్తున్న భక్తులు



మిరుదొడ్డి(దుబ్బాక): అల్వాల కోదండరాముడి జాతరలో బండ్ల ఊరేగింపు

పోటెత్తిన భక్తజనం

కూడవెల్లిలో మాఘ అమావాస్య పూజలు

స్వామి వారిని దర్శించుకున్న భక్తులు

పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీసులు

దుబ్బాకరూరల్/ మిరుదొడ్డి(దుబ్బాక): మాఘ అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకొని అక్బర్‌పేట భూంపల్లి మండలం కూడవెల్లి శ్రీ రామలింగేశ్వరాలయంలో జాతర బుధవారం జోరుగా ప్రారంభమైంది. స్వామి వారిని దర్శించుకోవడానికి ఉదయం నుంచే భక్తులు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. భక్తులు స్నానమాచరించి స్వామి వారికి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం వేళ పల్లకీ సేవ నిర్వహించారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్ సిబ్బంది ఎప్పటికప్పుడూ పర్యవేక్షించారు. దుబ్బాక సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీస్ బందో బస్తు నిర్వహించారు. దుబ్బాక ఆర్‌టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులు వేశారు. ముందస్తుగా వైద్య సిబ్బందిని ఏర్పాటు చేశారు. జాతరలో చిన్నపిల్లల కోసం బొమ్మల దుకాణాలు ఆకర్షణగా నిలిచాయి. అలాగే మిరుదొడ్డి మండల పరిధిలోని అల్వాల కూడవెల్లి ఒడ్డున వెలసిన కోదండరాముడి జాతరకు భక్త జనం పోటెత్తారు. నియోజకవర్గం నుంచే కాకుండా జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలి రావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. జాతరలో అల్వాల భక్తులు బండ్ల బోనాలను ఉత్సాహంగా ఊరేగించారు.

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

జాతరకు ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జాతరకు వచ్చే భక్తులకు సౌకర్యాలు ఏర్పాటు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. శాంతి భద్రతల విషయంలో పోలీస్‌లు విఫలమయ్యారని తెలిపారు. భక్తులకు రూట్ మ్యాప్ లేక పోవడంతో ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి నెలకొందన్నారు.



దుబ్బాక రూరల్ : దైవ దర్శనానికి క్యూ లైన్‌లో వెళ్తున్న భక్తులు



మిరుదొడ్డి(దుబ్బాక): పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, బక్కి వెంకటయ్య

పాపన్నపేట(మెదక్): మాఘ స్నానాలకు తరలివచ్చిన భక్తులతో బుధవారం ఏడుపాయల కిటకిటలాడింది. మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ జిల్లాల నుంచి సుమారు లక్షకు పైగా భక్తులు తెల్లవారు జాము నుంచే వెల్లువలా తరలివచ్చి మంజీరా తీరంలో పవిత్ర మాఘ స్నానాలు ఆచరించారు. ఘనపురం ప్రాజెక్టు, చెక్ డ్యాం, ఆలయం ఎదుట ఏర్పాటు చేసిన షవర్ బాత్‌ల వద్ద భక్తులు స్నానాలు చేశారు. అనంతరం బారులు తీరి దుర్గమ్మను దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి సుమారు గంటకు పైగా సమయం పట్టింది.

కూడవెల్లి వాగులో స్నానానికి వెళ్లి భక్తుడు మృతి

మరో ప్రమాదంలో భక్తులకు గాయాలు



రోడ్డు పక్కకు దూసుకెళ్లిన కారు



శివరాములు(ఫైల్)

దుబ్బాకరూరల్: వాగులో స్నానానికి వెళ్లి భక్తుడు మృతి చెందిన ఘటన అక్బర్‌పేటభూంపల్లి మండలంలోని కూడవెల్లి వాగులో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. దుబ్బాక మండలం పెద్దగుండవెల్లి గ్రామానికి చెందిన బిట్ల శివరాములు(42) కూడవెల్లి రామలింగేశ్వరస్వామిని దర్శనం చేసుకోవడానికి వాగులో స్నానం చేయడానికి వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాలు జారిపడి అక్కడికక్కడే మృతి చెందాడు. చుట్టుపక్కల వారు గమనించి పోలీస్‌లకు సమాచారం అందించారు. గజఈత గాళ్ల సహాయంతో మృత దేహాన్ని బయటకు తీశారు.

కారు, ఆటో ప్రమాదంలో భక్తులకు గాయాలు

సిద్దిపేటకు చెందిన ఓ కుటుంబం కారులో వచ్చి కూడకూడవెల్లి రామలింగేశ్వరస్వామిని దర్శించుకున్నారు. తిరిగి సిద్దిపేటకు వెళ్తున్న క్రమంలో ధర్మాజీపేట కమాన్ వద్ద కారు టైర్ పగిలి రోడ్డు పక్కకు దూసుకెళ్లింది. అందులో ప్రయాణిస్తున్న పుష్పలత, శ్రీకాంత్, దివ్యకు స్వల్పగాయాలయ్యాయి. అదే విధంగా సిద్దిపేట నుంచి కూడవెల్లి జాతరకు ఆటోలో వస్తున్న క్రమంలో చిట్టాపూర్ గ్రామ శివారులోకి రాగానే రోడ్డు పక్కన ఉన్న కల్వర్టులో పడింది. ఈ ప్రమాదంలో చంద్రయ్య అనే వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి.

సీసీఆర్‌టీ శిక్షణలో ప్రతిభచాటిన అధ్యాపకులు

దుబ్బాక: జాతీయ నూతన విద్యావిధానం(ఎన్‌పీఈ)2020 కి సంబంధించి న్యూఢిల్లీలో జరిగిన సీసీఆర్‌టీ(సెంటర్ ఫర్ కల్చరల్ రిసోర్సస్ అండ్ ట్రెనింగ్) లో దుబ్బాక మున్సిపల్ పరిధిలోని లచ్చపేట మోడల్ కళాశాల అధ్యాపకుడు రాధారి నాగరాజు ప్రతిభను చాటారు. ఎన్‌పీఈ 2020 ల భాగంగా సీసీఆర్‌టీ న్యూఢిల్లీలో 8 నుంచి 28వరకు 20 రోజులపాటు సమావేశాలు నిర్వహించగా 9 రాష్ట్రాల నుంచి 120 మంది ప్రతినిధులు హాజరయ్యారు. ఇందులో భాగంగా రాష్ట్రం నుంచి ఎంపికైన 10 మంది ప్రతినిధుల్లో రాధారి నాగరాజు ఒకరు. మంగళవారం రాత్రి సీసీఆర్‌టీ ముగింపు సమావేశంలో థియేటర్ ఇన్ ఎడ్యుకేషన్ అనే ప్రాజెక్టులో భాగంగా భారతదేశంలోని వివిధ ప్రాంతాల సాంస్కృతిక చరిత్ర విశేషాలను తెలియజేయడంతో పాటు విద్యలో ఏ విధంగా ఉపయోగించాలో వివరించారు. అదే విధంగా ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో డిజిటల్ డిస్ట్రిక్ట్ రేపోజిటోరీ అనే అంశంపై జరిగిన సదస్సులో తెలంగాణ సాయుధ పోరాటంలో ప్రముఖ ఘటనల గురించి వివరించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ప్రతిభచాటిన అధ్యాపకుడు నాగరాజుకు సీసీఆర్‌టీ డిప్యూటీ డైరెక్టర్ రాహుల్‌కుమార్ ప్రత్యేకంగా అభినందించడంతోపాటు సర్టిఫికెట్‌ను అందించారు.



నాగరాజుకు సర్టిఫికెట్ అందజేస్తున్న రాహుల్‌కుమార్

శిక్షణలో చిన్నశంకరంపేట ఉపాధ్యాయుడు

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండలం శేరిపల్లి గ్రామ జెడ్పీపాఠశాల భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు తిరుపతి ఢిల్లీలో 20 శిక్షణ పూర్తి చేసుకున్నాడు. ఈ సందర్భంగా డిప్యూటీ డైరెక్టర్ రాహుల్ కుమార్ చేతులమీదుగా సర్టిఫికెట్ అందుకున్నాడు. జాతీయ స్థాయి విద్యా బోధనను గ్రామస్థాయికి తీసుకెళ్లే క్రమంలో అనుసరించాల్సిన పద్ధతుల గురించి శిక్షణ ఇచ్చారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న థియేటర్ ఇన్ ఎడ్యుకేషన్ ప్రాజెక్ట్‌పై అవగాహన కల్పించి, వాటిని ఎలా ఉపయోగించుకోవాలో వివరించినట్లు తెలిపారు.

మద్యం మత్తులో కారు డ్రైవింగ్

బైక్‌లపైకి దూసుకెళ్లడంతో ముగ్గురికి తీవ్ర గాయాలు

జోగిపేట(అందోల్): మద్యం మత్తులో డ్రైవర్ కారును ద్విచక్రవాహనాల పైకి తీసుకెళ్లడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన జోగిపేట పట్టణంలో బుధవారం చోటు చేసుకుంది. జోగిపేట పోలీసుల కథనం మేరకు.. బొడ్మట్‌పల్లి గ్రామానికి చెందిన మొగులయ్య తన డ్రైవర్‌తో కలిసి కారులో ప్రభుత్వాస్పత్రి వైపు నుంచి మెయిన్ రోడ్డుకు వెళ్తున్నాడు. అప్పటికే మద్యం సేవించిన డ్రైవర్ అబ్దుల్ ఈసా కారును కుడి వైపునకు వెళ్లాల్సి ఉండగా రోడ్డు మీద ఎదురుగా ఉన్న రెండు బైకొట్టాడు. అనంతరం దుకాణాల వైపు దూసుకెళ్లింది. ఓ జెండా గద్దెను ఢీకొట్టి ఆగిపోయింది. అక్కడే ఉన్న స్థానికులు మొగులయ్య, డ్రైవర్‌ను క్షేమంగా బయటకు తీసుకొచ్చారు. ఈ ఘటనలో కన్‌సాన్‌పల్లి గ్రామానికి చెందిన బేగరి బాలయ్య, సంజీవయ్య, అక్సాన్‌పల్లికి చెందిన రాజుకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఏఎస్‌ఐ గౌస్ ఘటనా స్థలానికి చేరుకొని డ్రైవర్‌ను, కారును పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.



జెండా గద్దెపై ఆగిపోయిన కారు

పేకాట స్థావరంపై దాడి

గజ్వేల్‌రూరల్: పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్, గజ్వేల్ పోలీసులు దాడి చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకున్న ఘటన బుధవారం రాత్రి గజ్వేల్ పట్టణ శివారులో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పట్టణ శివారులో కొందరు పేకాట ఆడుతున్నారని సమాచారం అందింది. సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, గజ్వేల్ పోలీసులు కలిసి దాడి చేసి పేకాట ఆడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నున్న రూ.3,120 నగదుతో పాటు 3 సెల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు గజ్వేల్ పోలీసులు తెలిపారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడినట్లు తెలిస్తే టాస్క్‌ఫోర్స్ అధికారులకు 87126 67445, 87126 67446 సమాచారం అందించాలని సూచించారు.

బాలుడిని పనిలో పెట్టుకున్న వ్యక్తిపై కేసు

గజ్వేల్‌రూరల్: బాలుడిని పనిలో పెట్టుకున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు గజ్వేల్ పోలీసులు తెలిపారు. పోలీసులు, లేబర్ శాఖ అధికారుల కథనం మేరకు.. మండల పరిధిలోని పిడిచెడ్ రోడ్డు మార్గంలో గల ఓ ఆయిల్‌మిల్‌లో బాలుడు పని చేస్తున్నట్లు సమాచారం అందింది. ఆపరేషన్ స్మైల్‌లో భాగంగా బుధవారం అసిస్టెంట్ లేబర్ అధికారి జ్యోతి ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో బాలుడు పనిచేస్తున్నట్లు గుర్తించి పనిలో పెట్టుకున్నందుకు ఆయిల్‌మిల్ నిర్వాహకుడు ఉమాపతిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

గంజాయి మత్తులో దాడి

చేర్యాల(సిద్దిపేట): గంజాయి మత్తులో పలువురిపై దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పీ.నీరేశ్ తెలిపారు. బుధవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని గుర్జకుంటకు చెందిన ఉమేశ్ గంజాయి మత్తులో అదే గ్రామానికి చెందిన వెంకట్, రాజయ్యలపై దాడి చేశాడు. దాడిని అడ్డుకునే క్రమంలో మరో వ్యక్తి ప్రవీణ్‌పై కూడా దాడికి పాల్పడ్డాడు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మేమున్నామని భరోసా కల్పించండి

- సిద్దిపేట సీపీ అనురాధ
- షీ టీమ్, భరోసా, స్నేహిత సిబ్బందితో సమావేశం

సిద్దిపేటకమాన్: పిల్లలు, మహిళల రక్షణకు మేమున్నామనే భరోసా కల్పించాలని సిద్దిపేట సీపీ అనురాధ తెలిపారు. పిల్లల, మహిళల రక్షణకు తీసుకుంటున్న చర్యల గురించి సిద్దిపేట పోలీసు కమిషనర్ కార్యాలయంలో షీ టీమ్, భరోసా, స్నేహిత మహిళా సపోర్టు సెంటర్ సిబ్బందితో సీపీ బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సమన్వయంతో విధులు నిర్వహించి మహిళలు, పిల్లల రక్షణకు పెద్దపీట వేయాలన్నారు. పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు షీటీమ్ నిర్వహిస్తున్న కార్యక్రమాల గురించి తెలియజేయాలన్నారు. ఫిర్యాదు బాక్స్‌లో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలన్నారు. హాట్‌స్పాట్‌లపై నిఘా మరింత పెంచాలన్నారు. మహిళలను ఎవరైనా వేధింపులకు గురి చేస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. సంబంధిత ఏసీపీ అధికారులు వారానికి ఒక రోజు షీటీమ్ నిర్వహిస్తున్న కార్యక్రమాలపై మానిటర్ చేయాలని సూచించారు. హాట్‌స్పాట్ పరిసర ప్రాంతాల్లో షీ టీమ్ ఫిర్యాదు బాక్స్‌లు ఏర్పాటు చేయాలని మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ దుర్గకు సూచించారు. ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం హాట్‌స్పాట్‌ల వద్ద విజుబుల్ పోలీసింగ్ విధులు నిర్వహించాలన్నారు. సమావేశంలో సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్ డివిజన్‌ల షీటీమ్, భరోసా సిబ్బంది పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న సీపీ అనురాధ

2న జాతీయ సాహిత్య పరిషత్ వార్షికోత్సవం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కవులు

కరపత్రాలను ఆవిష్కరించిన జాసాప కవులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జాతీయ సాహిత్య పరిషత్ 38వ వార్షికోత్సవం వచ్చేనెల 2న జిల్లా కేంద్రంలోని సరస్వతీ శిశుమందిర్‌లో నిర్వహించనున్నట్లు ప్రధాన కార్యదర్శి రాజేశం తెలిపారు. ఈ సందర్భంగా వార్షికోత్సవ కరపత్రాలను బుధవారం జిల్లా కేంద్రంలో ఆవిష్కరించారు. అనంతరం రాజేశం మాట్లాడుతూ.. 38వ జాసాప వార్షికోత్సవానికి జాతీయ సాహిత్య పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు ఆంజనేయరాజు, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గాజుల రవీందర్ తదితరులు హాజరుకానున్నట్లు తెలిపారు. వార్షికోత్సవం సందర్భంగా ప్రతీ సంవత్సరం అందించే సాహితీ పురస్కారాలను అందించనున్నట్లు పేర్కొన్నారు. తడకమడ్ల సాంప్రదాయ సాహితీ పురస్కారం – అవధాని అవుసుల భానుప్రకాశ్ (మేడ్చల్), ఐతా భారతీ చంద్రయ్య సాంప్రదాయ కథా పురస్కారం – కూర చిదంబరం (హైదరాబాద్), ఎన్నవెల్లి బాలసాహిత్య పురస్కారం – గరిపల్లి అశోక్ (సిద్దిపేట) కు నగదుతో పాటు ప్రశంసాపత్రాలు అందించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా వెన్నెల గువ్వలు బాలల కథలు పుస్తకావిష్కరణ ఉంటుందన్నారు. కవులు, రచయితలు, సాహితీప్రియులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో జాసాప కవులు ఐతా చంద్రయ్య, ఎన్నవెల్లి రాజమౌళి, వరుకోలు లక్ష్మయ్య, కొర్తివాడ రాజేందర్, బస్వ రాజ్ కుమార్, నల్ల అశోక్, దాసరి రాజు, అనిశెట్టి సతీష్ కుమార్, భైరి రమేశ్, చీకోటి రాములు, బాలచంద్రం, తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో దుకాణాలు దగ్ధం

నారాయణఖేడ్: అగ్ని ప్రమాదంలో చిరు వ్యాపారుల దుకాణాలు దగ్ధమైన ఘటన ఖేడ్ పట్టణంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. పట్టణంలోని రాజీవ్ చౌక్ సమీపంలోని రాయిపల్లి రోడ్డు పక్కన పలువురు వ్యాపారులు డబ్బాలు, షెడ్లు, పూరీపాకలు ఏర్పాటు చేసుకొని చిరు వ్యాపారాలు చేసుకుంటున్నారు. బుధవారం తెల్లవారు జామున ఆకస్మాత్తుగా మంటలు చెలరేగి దుకాణాలు దగ్ధమయ్యాయి. అటుగా వెళ్తున్న మున్సిపల్ పారిశుధ్య కార్మికులు గమనించి కొన్ని డబ్బాలను రోడ్డుపై తెచ్చి కాలిపోకుండా కాపాడారు. అప్పటికే నాలుగు దుకాణాలు కాలిపోయాయి. ప్రభుత్వం ఆదుకో వాలని బాధితులు కోరారు. సుమారు రూ.2 లక్షల వరకు నష్టం వాటిల్లిందని తెలిపారు.



దగ్ధమవుతున్న దుకాణాలు

విదేశాల్లో శిక్షణ, పరిశోధనలను ప్రోత్సహిస్తాం

బీవీఆర్‌ఐటీ విద్యాసంస్థల చైర్మన్ విష్ణురాజు

నర్సాపూర్ రూరల్: విద్యార్థుల అభివృద్ధి కోసం విదేశాల్లో శిక్షణ, పరిశోధనలను ప్రోత్సహిస్తామని బీవీఆర్ ఐటీ విద్యాసంస్థల చైర్మన్ విష్ణురాజు అన్నారు. బుధవారం కళాశాలకు చెందిన మెకానికల్, కెమికల్ విభాగాలకు చెందిన విద్యార్థులు, అధ్యాపకులు జపాన్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఏజెన్సీ(జేఎస్‌టీ) స్పాన్సర్ చేసిన సకురా సైన్స్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్‌లో పాల్గొని తిరిగి వచ్చిన విద్యార్థులను అధ్యాపకులను అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మెకానికల్, కెమికల్ ఇంజనీరింగ్ విద్యార్థులు అధ్యాపకులతో కలిసి 19వ తేదీ నుంచి 25 వరకు జపాన్ కుమమోటో యూనివర్సిటీలో ప్రొఫెసర్ షుయిచీ టోరీ, రీసెర్చ్ డీన్ డాక్టర్ ఎడ్ల రాజుల ఆధ్వర్యంలో మురుగునీటి శుద్ధి, ఘన వ్యర్థాలను ఉపయోగకరమైన ఉత్పత్తులుగా మార్చిడి, వ్యర్థాలతో విద్యుత్ ఉత్పత్తి వంటి మార్పిడి చేసే అంశాలపై అధ్యయనం చేశారు. దీంతోపాటు అక్కడి యూనివర్సిటీ ప్రొఫెసర్లతో ఆయారకాల పరిశోధనలు చర్చించారు. పరిశోధనకు వెళ్లి తిరిగి వచ్చిన విద్యార్థులు, అధ్యాపకుల బృందం సభ్యులు, జపాన్ కుమమోటో యూనివర్సిటీతో సహకారాలను స్థాపించినందుకు అభినందించారు. కార్యక్రమంలో బీవీఆర్‌ఐటీ సంస్థల వైస్ చైర్మన్ రవిచంద్రన్ రాజగోపాల్, సెక్రటరీ ఆదిత్య విస్సం, డైరెక్టర్ లక్ష్మీప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ సంజయ్ దుబే, అధ్యాపకులు రాధిక, వరుణ్, తదితరులు పాల్గొన్నారు.



పరిశోధనలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకుల బృందం

ముగ్గురిని బలిగొన్న నిద్రమత్తు

- స్టీరింగ్ వదిలిపెట్టిన డ్రైవర్.. కల్వర్టును ఢీకొన్న కారు
- దంపతులతోపాటు మరో వ్యక్తి దుర్మరణం
- ఆరుగురికి తీవ్రగాయాలు
- మాఘమాసం పుణ్యస్నానాలకు కాళేశ్వరం వెళ్తుండగా ఘటన
- కరీంనగర్‌లో సిద్దిపేట జిల్లా వాసులు మృతి

సిద్దిపేటజోన్/చిన్నకోడూరు(సిద్దిపేట): డ్రైవర్ నిద్రమత్తు ముగ్గురు ప్రాణాలు తీసింది. మరో ఆరుగురిని తీవ్రంగా గాయపర్చింది. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి వద్ద రాజీవ్ రహదారిపై బుధవారం వేకువజామున 5.30 గంటలకు ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఘటనలో భార్యాభర్తలు ఆకుల కనకయ్య(69), తార(62) అక్కడికక్కడే మృతి చెందగా కనకయ్య వియ్యంకుడు జనార్దన్(62) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయాడు. ఎస్సై శ్రావణ్‌కుమార్ కథనం ప్రకారం.. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని శ్రీనగర్‌కాలనీకి చెందిన ఆకుల కనకయ్య మేస్త్రీ పని చేస్తూ కుటుంబాన్ని సాకుతున్నాడు. మాఘమాసం సందర్భంగా కాళేశ్వరంలోని త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు ఓ ప్రైవేట్ కారును అద్దెకు తీసుకున్నారు. అందులో భార్య తార, వీరి పెద్దకుమారుడు శ్రీనివాస్(40), మనుమలు అభిత్(10), మాన్విత్(4), శ్రీనివాస్ అత్తమామ సిద్దిపేట జిల్లా చిన్నకోడూర్ మండలం గొనెపల్లి గ్రామానికి చెందిన జనార్దన్-రమాదేవి(60), బావమరిది మనోజ్‌కుమార్(30)తో కలిసి సిద్దిపేటలో బుధవారం వేకువజామున బయల్దేరారు. వారు కాట్నపల్లికి చేరుకోగా.. నిద్రమత్తులోకి వెళ్లిన డ్రైవర్ బాల్‌రెడ్డి.. ఒక్కసారిగా స్టీరింగ్ వదిలిపెట్టాడు. దీంతో వేగంగా ఉన్న వాహనం కల్వర్టును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భార్యాభర్తలు కనుకయ్య, తార అక్కడిక్కడే దుర్మరణం చెందారు. గాయపడిన వారిని కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ జనార్దన్ మృతి చెందాడు. డ్రైవర్‌తోపాటు శ్రీనివాస్, అభిత్, మాన్విత్, రమాదేవి, మనోజ్‌కుమార్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం వీరి పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు. కనకయ్య చిన్న కుమారుడు రాజేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొన్నట్లు ఎస్సై వివరించారు. పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ, సీఐ సుబ్బారెడ్డి కరీంనగర్‌కు వెళ్లి ప్రమాద వివరాలపై ఆరా తీశారు. మృతుడు జనార్దన్‌ది చిన్నకోడూరు మండలం గోనెపల్లి గ్రామం. వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ ప్రమాదంతో మృతుల కుటుంబాల్లో విషాఛాయలు అలుముకున్నాయి.



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు



కనకయ్య (ఫైల్)



తార (ఫైల్)



జనార్దన్ (ఫైల్)